పత్రికాప్రకటన కాకినాడ, ఫిబ్రవరి 19, 2019.

**జిల్లాలో 77 పోలింగ్ స్టేషన్లలో భవనాల మార్పు.**

**678 పోలింగ్ స్టేషన్ల నామావళి మార్పు**

–రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో

జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా.

జిల్లాలో రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా 77 పోలింగ్ స్టేషన్లలో భవనాల మార్పును ప్రతిపాదించడం జరిగిందని కలక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. పోలింగ్ స్టేషన్ల భవనాల మార్పు పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారంనాడు కాకినాడ కలక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల భవనాల మార్పును గతంలో పోలింగ్ నిర్వహించిన భవనాలు పాడైపోవడం లేదా పోలింగ్ నిర్వహణకు సరిపోని పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ఈ ప్రతిపాదనలను చేసారన్నారు. ఓటర్లకు సమీపంలో పోలింగ్ స్టేషన్ మరియు పోలింగ్ నిర్వహణకు అనువుగా వుండేలా ఈ ప్రతిపాదనలు చేసారని, వీటి పై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు ఎమైనా వుంటే రాత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. అదే విధంగా జిల్లాలోని 678 పోలింగ్ స్టేషన్లలో నామావళి మార్పును ప్రతిపాదించడం జరిగిందని అన్నారు. ఈ పోలింగ్ స్టేషన్లు అదే ప్రదేశంలో కొనసాగుతాయని వాటిలో అవసరమైన చిన్న మార్పులు చేపడతారని అన్నారు . జిల్లాలో గతంలో 37 లక్షల ఓటర్లు వుండేవని ప్రస్తుతం 40 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారని ఈ సంఖ్య మరో లక్ష పెరిగే అవకాశం వుందని అన్నారు. జిల్లాలోని 19 నియోజకవర్గాలలో ఏర్పాటు చేసే 4580 పోలింగ్ స్టేషన్లను ప్రభుత్వం మరియు ఎయిడెడ్ పాఠశాల భవనాలలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలక్టర్ తెలిపారు.

**ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పై అవగాహన :-**

జిల్లాలో ఎన్నికలలో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని కలక్టరు కార్తికేయ మిశ్రా తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు మరియు వి.వి.ప్యాట్స్ పై పోలింగ్ స్టేషన్స్ స్థాయిలో అవగాహన కోసం 410 చొప్పున బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్‌లు కేటాయించామని అన్నారు. వీటికి అదనంగా నియోజకవర్గ స్థాయిలో అవగాహన కల్పించడానికి ఒక ప్రత్యేక టీమును కూడా ఏర్పాటు చేసామని అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పై అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలక్టర్ కోరారు. అదే విధంగా అన్ని రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో బ్లాక్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ పై కలక్టర్ మాట్లాడుతూ క్లైయిములు, అభ్యంతరాల ప్రక్రియ నామినేషన్ల చివరి తేదీ వరకు కొనసాగుతుందని గానీ చివరి నిమిషంలో సమస్యలు లేకుండా ముందుగానే చర్యలు తీసుకునేందుకు మరియు తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని కలక్టర్ కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న సి.పి.యం. జిల్లా కార్యదర్శి సిహెచ్.అజయ్ కుమార్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో మెరుగైన మౌలిక సదుపాయాలు వుండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. టిడిపి ప్రతినిధి మందాల గంగ సూర్యనారాయణ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో లోపలికి, బయటకు వెళ్ళేందుకు ప్రత్యేక ద్వారాలు వుండాలన్నారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ యం.వి.గోవిందరాజులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఆకుల వెంకట రమణ, వైఎస్ఆర్‌సిపి ప్రతినిధి ఆర్.వెంకటేశ్వరరావు, బిఎస్‌పి ప్రతినిధి ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )